రేపు జడ్పీ స్థాయిసంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 3న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశభవనంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల దాకా సమావేశాలు కొనసాగుతాయని సీఈఓ తెలిపారు.

జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి అనుగ్రహంతో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ సిరి జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. దుర్గామాత ఆశీస్సులతో సుఖ సంతోషాలతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిదించాలని ఆమె ఆకాంక్షించారు.

అశ్వవాహనంపై ఆది దంపతులు

శ్రీశైలం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగం, శక్తిపీఠం కలిగిన శ్రీశైలం క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం అమ్మవారు రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. రాత్రి మల్లికార్జునస్వామితో కలసి అమ్మవారు అశ్వవాహనంపై విహరించారు. రమావాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు చతుర్భుజాలను కలిగిన పాశం, అంకుశం, పద్మం, చెరుకు గడను కలిగి ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం కుమారి పూజ నిర్వహించారు. ఇందులో భాగంగా రెండు నుంచి పదేళ్లలోపు బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలు సమర్పించారు. రాత్రి ఆది దంపతులు అశ్వవాహనంపై విహరిస్తుండగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అక్కమహాదేవి అలంకారం మండపం నుంచి గ్రామోత్సవం కొనసాగింది.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి ఆనం

దసరా మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్ద పట్టు వస్త్రాలకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రిని సాదరంగా ఆహ్వానించారు. శ్రీశైలం పాలక మండలి చైర్మన్ రమేష్ నాయుడు, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్ లాల్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్, ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

నిజరూప అలంకారంలో కామేశ్వరీదేవి

● అశ్వవాహనంపై ఆశీనులైన అమ్మవారు



మహానందిలో అశ్వవాహనంపై అమ్మవారి గ్రామోత్సవం



మహానంది, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా ఉత్సవాలు వైభోవపేతంగా జరుగుతున్నాయి. బుధవారం పదో రోజు కామేశ్వరీదేవి నిజరూప అ లంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక యాగశాల మంటపంలో శరన్నవరాత్రి ఉభయ దాతలతో చండీ హోమంతో పాటు కుంకుమార్చన పూజలను నిర్వహించారు. సాయంత్రం అలంకార మంటపంలో భక్తుల సమక్షంలో సహస్ర దీపాలంకరణ సేవను జరిపారు. అశ్వవాహనంపై అమ్మవారు ఆశీనులయ్యారు. ఆలయ మాడవీధుల గుండా గ్రామో త్సవం జరిపారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు శమీ పూజలు: మహానంది క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో చివరిరోజు గురు వారం శమీ ఉత్సవ పూజను నిర్వహిస్తున్నట్లు ఆలయ వేదపండితులు రవి శంకర్ అవధాని తెలిపారు. ముందుగా ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహి స్తారన్నారు. అనంతరం ప్రత్యేక పల్లకిపై ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆశీనులు చేసి క్షేత్ర వీధుల గుండా గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఈశ్వర్‌నగర్ కాలనీ జమ్మి చెట్టు వద్ద ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి పూజలు నిర్వహిస్తారన్నారు.

సిద్ధిధాత్రి అలంకారంలో చౌడేశ్వరీదేవి



బనగానపల్లె, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి సందర్భంగా బనగానపల్లె మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత బుధవారం సిద్ధిధాత్రి అలంకారంలో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డితో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మహిషాసుర మర్దినిగా సుంకులాపరమేశ్వరి దేవి





అమ్మవారిని దర్శించుకున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా సుంకులాపరమేశ్వరి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం మండలంలోని కె.నాగలాపురంలో అమ్మవారి ఆలయంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదోరోజు అమ్మవారు మహిషాసుర మర్దినిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అమ్మవారి దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ రాధాకృష్ణ, గోపాల్ రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ పర్యవేక్షించారు.

అశ్వవాహన అలంకరణలో మంచాలమ్మ



మంత్రాలయం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ రజిత అశ్వవాహనం దర్శనమిచ్చారు.బుధవారం నవరాత్రోత్సవాల్లో పదవ రోజు అశ్వయుజ నవమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా పండితులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మలవిసర్జనం, క్షీరాభిషేకం, కుంకుమ సేవ, సుగంధ ద్రవ్యాలతో విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పసుపు,గందం, పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధరకాల పుష్పాలు, వెండి అశ్వవాహనంపై శోభాయమానంగా అలంకరించారు. మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పీఠాధిపతి మహామంగళహారతులు ఇచ్చారు.



కల్లూరు అమ్మవారిశాలలో దుర్గాదేవి అలంకరణ



ఆదోనిలో నగరేశ్వర దేవాలయంలో రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

● కలెక్టర్ ఏ.సిరి



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా షెడ్యూల్ విడుదల కాలేదన్నారు. నగరంలో సుందరీకరణ, పారిశుధ్యం, రోడ్ల మరమ్మతులు చేయాలని కమిషనర్ విశ్వనాథ్‌ను ఆదేశించారు. హెలిప్యాడ్‌ల నిర్మాణంపై ఆర్అండ్‌బీ ఎస్ఈతో చర్చించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు రోడ్‌షో నిర్వహణ, పార్కింగ్‌పై సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జేసీ డా.బి.వ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ దంపతులు

కర్నూలు క్రైం, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆయన సతీమణి ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్ దీపికాపాటిల్ ఈ పూజలో పాల్గొన్నారు. అన్ని రకాల తుపాకులు, వాహనాలకు, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ విజయదశమి రోజు నుంచి అందరికీ విజయం చేకూరాలని ఆకాంక్షించారు.

నిమ్మకాయపై జగన్మాత చిత్రాలు



దసరా పర్వదినం సందర్భంగా నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ నిమ్మకాయ మీద రెండు అమ్మవారి చిత్రాలు వేశారు. ఈ చిత్రంలో దుర్గాదేవి,మహిషాసురుని వధించిన తర్వాత శాంతించి చిరునవ్వు తో భక్తులకు దీవిస్తున్నట్లు, రెండో చిత్రంలో అమ్మవారిని జగన్మాత రూపంలో ఉన్నట్లు వేశారు. అమ్మవారి ఆశీస్సులు భక్తులపై ఉండాలని చిత్రకారుడు కోటేష్ ఆకాంక్షించారు.

● నంద్యాల కల్చరల్, ఆంధ్రజ్యోతి

కొనాలంటే గుడ్లు తేలెయాల్సిందే..



చికెన్, మటన్ ధరలు మండిపోతున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కనీసం కోడి గుడ్లతోనైనా సరిపెట్టుకుందామంటే వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఒకప్పుడు రూ.4, 5 పలికిన గుడ్డు ధర ఇప్పుడు రిటైల్ మార్కెట్లో ఏకంగా రూ.8, 10కు చేరుకుంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఏడాది కాలంగా కోడి గుడ్ల ధరలు మండుతూనే ఉన్నాయి. పల్లె, పట్టణాలు అన్న తేడా లేకుండా తోపుడు బండ్లపై ఆమ్లెట్లు, న్యూడిల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. వినియోగానికి తగినంత ఉత్పత్తిలేకే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ప్రతి రోజూ లక్షకు పైగా కోడిగుడ్ల వినియోగం జరుగుతున్నట్టు వ్యాపార వర్గాల అంచనా.

● కొలిమిగుండ్ల, ఆంధ్రజ్యోతి

జయ జయహే...జగన్మాత!

- నేడు విజయదశమి



కర్నూలు కల్చరల్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అఖిలాండ భక్తకోటి బ్రంహ్మాండ నాయకి, ఆది పరాశక్తి, కొలిచే వారికి కొంగు బంగారమైన దుర్గామాత నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. నవరాత్రి ఉత్సవాల్లో విశేష పూజలు అందుకుంటున్న జగన్మాత వేడుకల్లో దుర్గాష్టమి పూజలు ఆలయాల్లో విశేషంగా నిర్వహించారు. నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం జిల్లాలోని హైందవ భక్తులు మహార్నవమి వేడుకను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయుధ పూజలు నిర్వహించారు. ఆయుధ పూజల సందర్భంగా జిల్లాలోని రైస్ మిల్లులు, ఆటోమొబైల్ వర్క్‌షాపులు, ఇతర కర్మాగారాలను పూలతో అలంకరించి ఆయుధ పూజలకు సిద్ధం చేశారు. నూతనంగా కొన్న వాహనాలతోపాటు, తాము నిత్యం ఉపయోగించే వాహనాలకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దసరా వేడుకల్లో చివరి రోజున గురువారం విజయ దశమి (దసరా) పండుగను జిల్లా వాసులు అత్యంత వైభవంగా నిర్వహించుకోనున్నారు. లోకకంటకుడైన మహిషాసురుడ్ని వధించేందుకు దుర్గామాత తొమ్మిది రోజుల పాటు పోరాటం చేసి అలసినందుకు గుర్తుగా పదో రోజున పుష్పాలంకరాలతో జగజ్జననిని విశేషంగా పూజిస్తారు. జిల్లాలోని పల్లెలు దసరా మహోత్సవానికి ముస్తాబయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో దసరా వేడుకల సందడి చివరి మూడు రోజుల్లో కనిపిస్తోంది. దూర ప్రాంతాల్లో నివసించే కుటుంబ సభ్యులంతా ఇళ్లకు చేరుకోవడంతో ప్రతి ఇంట్లోనూ సందడిగా మారింది.

పత్తి రైతులకు శుభవార్త

● క్వింటం పత్తి ధర రూ.8,110



పెంచికలపాడులోని సీసీఐ కొనుగోలు కేంద్రం

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేళ కూటమి ప్రభుత్వం పత్తి రైతులకు శుభవార్త అందించింది. ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తికి క్వింటానికి రూ.8110లు అందేలా చర్యలు తీసుకోవాలని సీసీఐని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అన్నదాతలు పండించిన పత్తిని దళారుల జోక్యం లేకుండా వారు నేరుగా విక్రయించి లబ్ధి పొందేందుకు సీసీఐ కసరత్తు చేస్తుంది. కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంచడంతో కపాస్ కిసాన్ యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనుంది. ఈనెల మొదటి వారంలో పత్తి సేకరణ ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు కపాస్ కిసాన్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రభుత్వం నుంచి ఉత్తర్వులొచ్చాయి

అక్టోబరు నుంచి రైతుల ద్వారా సీసీఐ పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి ఎలాంటి అక్రమాలు, పొరపాట్లు జరగకుండా సీసీఐ కేంద్రాలకే రైతులు పత్తిని తీసుకెళ్లి నేరుగా అమ్ము కునేందుకు కేంద్రం కపాస్ కిసాన్ యాప్‌ను అమలులోకి తెచ్చింది. పత్తి పండించిన రైతులందరూ ఇప్పటి నుంచే ఈయాప్‌లో తమ పొలంతో పాటు బ్యాంకు వివరాలను నమోదు చేసుకోవాలి.

● నారాయణమూర్తి, ఏడీఎం, కర్నూలు

దసరా వేడుకల్లో సమైక్యత అభినందనీయం



టీజీ వెంకటేశ్‌కు స్వాగతం పలుకుతున్న రాజస్థాన్‌వాసులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ తరహాలో దసరా ఉత్సవాల్లో సమైఖ్యత చాటడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం చిదంబరరావు వీధిలో రాజస్థాన్ విష్ణు సమాజ్ సంఘ్ ఏర్పాటు చేసిన దాండియా నృత్యంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులు టీజీని రాజస్థాన్ తరహాలో సన్మానించారు.

పొట్టి శ్రీరాములు త్యాగంతోనే రాష్ట్రావతరణ

కర్నూలు కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు త్యాగనిరతితోనే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. బుధవారం మద్దూరునగర్ పింగళి సూరన తెలుగు తోటలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించారు. భాషా ప్రయుక్త ప్రాతిపదికన తెలుగువారికోసం ప్రత్యేక రాష్ట్ర సాధనకు 58 రోజుల పాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి పొట్టి శ్రీరాములు అమరజీవి అయ్యారన్నారు. అనంతరం మన రాష్ట్రం రెండు ముక్కలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా ఏర్పడటం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన మలిపెద్దు నాగేశ్వరరావును, తెలుగు బాషా వికాస ఉద్యమం నేతలు కేసీ కల్కూరా, జేఎస్సార్ కే.శర్మను సన్మానించారు. కేవీ సుబ్బారెడ్డి, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, కాపునాడు అధ్యక్షుడు ఆర్జ రామకృష్ణ, ఆవోపా అధ్యక్షుడు డా.పి.లక్ష్మినారాయణ, డా.దండబోయిన పార్వతి పాల్గొన్నారు.

డోన్ ఎమ్మెల్యే కోట్ల పూజలు

కోడుమూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఆయన సతీమణి కోట్ల సుజాతమ్మ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి వల్లెలాంబదేవి ఆయలంలో పూజలు చేశారు. పల్లకీ సేవలో పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. కోట్ల కవితమ్మ, కోట్ల కౌశిక్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న, మాజీ సర్పంచు రాంబాబు, హేమాద్రిరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి భరత్



కర్నూలు అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి మంత్రి టీజీ భరత్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని తెలిపారు. దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలు, సిరి సంపదలతో తులతూగాలని, విజయాలు సిద్ధించాలని, రాష్ట్రం, జిల్లాసుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

పని చేస్తేనే పైసలు



ఉపాధి హామీ పథకం అవినీతికి కేరాఫ్‌గా ఉండేది. సోషల్ ఆడిట్‌లో ఇదే విషయం పలుమార్లు స్పష్టమైంది. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకంలో మస్టర్ల మాయాజాలానికి అడ్డుకట్ట వేయడంతో పాటు అవినీతి అక్రమారులను గుర్తించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంది. ప్రతి శ్రామికుడికి ఈకేవైసీ చేసి పనులకు హాజరయ్యే వారికి వేతనం అందేలా ప్రత్యేక విధానాన్ని అమలుచేస్తోంది.

- 'ఉపాధి'లో అవినీతికి చెక్
- శ్రామికులకూ ఈకేవైసీ విధానం అమలు
- రెండు సార్లు ముఖ హాజరు
- బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట

నంద్యాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీలో పని చేసే శ్రామికులకు ఇక నుంచి పనిచేస్తే పైసలు అందుతాయి. బోగస్ శ్రామికులు లేకుండా పనిచేసే సమయంలో ఆయా శ్రామికులకు రెండుసార్లు ముఖ హాజరు కూడా తీసే విధంగా ప్రణాళిక రచించింది. తద్వారా ఎప్పటికప్పుడు ఆయా పనులకు హాజరయ్యే వారికి మాత్రమే వేతనం అందనుంది. ఇదేతరుణంలో బోగస్ శ్రామికులకు ఇక చెక్ పెట్టినట్లైంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. గతంలో మాదిరిగా కాకుండా ఉపాధిలో పని చేస్తేనేవేతనం అన్నట్లైంది. ఏదిఏమైనా ఉపాధి హామీ పథకంలో అవినీతి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో అవినీతి అక్రమార్కులకు ఝులక్ ఇచ్చినట్లైంది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

ఇప్పటికే ప్రభుత్వం నుంచి జిల్లా డ్వామా అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో ఆశాఖ అధికార మంత్రాంగం సైతం అప్రమత్తమై ఆయా పనుల్లో నిమగ్నమ య్యారు. జిల్లాలో ప్రస్తుతం యాక్టివ్‌లో ఉన్న 2,15,000 జాబ్‌కార్డుల పరంగా.. 3,82,000 మందికి ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఇప్పటికి జిల్లాలో 1,100మందికి పూర్తి చేశారు. మిగిలిన వారందరికీ కూడా అక్టోబరు నెలలో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

ప్రతి నాలుగు గంటలకు ఒక సారి

ఉపాధిలో పనుల ఎంపిక నుంచి ఆయా పనులు పూర్తైయ్యే వరకు ఆశాఖ అధి కారులు పకడ్బందీగా చర్యలు తీసుకోనున్నారు. పనికి వచ్చే వారికి జాబ్‌కార్డు ఆధా రంగా ఆయా శ్రామికులకు సంబంధించి ఈకేవైసీ చేయడం, పని చేసే సమయాల్లో ప్రతి నాలుగు గంటల వ్యత్యాసంతో రెండు ముఖ హాజరు(ఫేస్ బయోమెట్రిక్) వేయించడం జరుగుతుంది. ఆయా సమయాల్లో ఎవరైనా ఒకరికి బదులు మరొకరు వేసే ప్రయత్నం చేసి పనిచేసినట్లు చూపితే వారికి ఎలాంటి వేతనం రాదు. శ్రామికుల జాబ్ కార్డు ఆధారంగా ఆయా వారి ఆధార్ అనుసంధానం కూడా చేస్తారు. మొత్తంగా భవిష్యత్‌లో ఉపాధిలో బోగస్ మస్టర్లకు అడ్డుకట్ట పడినట్లైంది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

● జిల్లాలో జాబ్ కార్డులు	: 2,67,000
● ఉపాధిలో పని చేస్తున్న శ్రామికులు	: 5,01,000మంది
● యాక్టివ్ జాబ్ కార్డులు	: 2,15,000
● పనికి వస్తున్న శ్రామికుల సంఖ్య	: 3,82,000 మంది
● ఈకేవైసీ చేయాల్సినవి	: 3,82,000
● ఈకేవైసీ పూర్తయినవి	: 1,100 మంది

ఈకేవైసీ వేగవంతం చేస్తాం



ఉపాధి శ్రామికులకు ఈకేవైసీ విధానం అక్టోబరు నెలలో పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నాం. పని చేసే సమయాల్లో రెండు సార్లు ముఖ హాజరు చేయాల్సి ఉంది. తద్వారా భవిష్యత్తులో అక్రమంగా వేతనం పొందే అవకాశం లేదు. శ్రామికులు కూడా ఈ విషయాన్ని గ్రహించాలి.

● సూర్యనారాయణ,పీడీ, డ్వామా, నంద్యాల

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలి

శ్రీశైలం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మల్లన్న ఆశీస్సులతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వేడుకున్నారు. బుధవారం దసరా ఉత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలను సరమ్పించేందుకు మంత్రి శ్రీశైలం చేరుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు వచ్చానన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరి అమ్మవారి దీవెనలు, స్వామి వారి రక్ష ఉండాని కోరుకున్నట్లు తెలిపారు. శ్రీశైలం అభివృద్ధికి అనేక ప్లాన్లు ఉన్నాయని, వాటిని అమలు చేయాలంటే దేవదాయశాఖకు ఉన్న భూమి అంతా క్షేత్రానికి దక్కాలన్నారు. 16న ప్రధాని శ్రీశైలంకు వస్తున్నారని, భూమి ప్రస్తావన కూడా తీసుకొని వచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్‌లాల్, శ్రీశైలం దేవస్థాన ఛైర్మన్ రమేష్‌నాయుడు, కలెక్టర్, ఎస్పీ, ఈవో పాల్గొన్నారు.



శ్రీశైలంలో మంత్రి ఆనం

జీవో 99 రద్దుచేయాలి

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీ వైద్యులకు సంబంధించి జీవో 99ని రద్దు చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అంకిరెడ్డి అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వైద్యులు ధర్నా చేశారు. డిపార్ట్‌మెంట్‌లో క్లినికల్ 30శాతం, నాన్ క్లినికల్ 50శాతం ఇన్‌సర్వీస్ సీట్లను కల్పించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు గత 20నుంచి 25సంవత్సరాలుగా మొదటి ప్రమోషన్‌కు కూడా నోచుకోలేదన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న చంద్రన్న సంచార చికిత్సా అలవెన్స్ రూ.4,500లను తక్షణమే అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు జగదీశ్చంద్రారెడ్డి, కాంతారావునాయక్, రూపేంద్రనాథ్‌రెడ్డితో పాటు జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

బన్ని ఉత్సవానికి 700 మంది పోలీసులు

- 340 రింగుల కర్రలు సీజ్
- 200 మంది ట్రబుల్ మాంగర్స్‌ను బైండోవర్ చేశాం
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా శుక్రవారం దేవరగట్టులో జరిగే మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం బన్ని ఉత్సవాల్లో పోలీసులు తీసుకుంటున్న చర్యలపై ఆయన వివరాలు వెల్లడించారు. కలెక్టర్‌తో కలిసి రెండు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించామని, ఒకటి కర్నూలు కలెక్టరేట్‌లో, మరొకటి దేవరగట్టులో నిర్వహించామని తెలిపారు. బన్ని ఉత్సవానికి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. 110 సీసీ కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే సీసీ కెమెరాకలు ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 20 బెడ్లతో ఒక తాత్కాలిక ఆసుపత్రిని కూడా ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవంలో ఎవరైనా గాయాలపాలైతే వారి కోసం 104, 108 అంబులెన్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో 15 రోజుల నుంచి గ్రామాల ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. ఉత్సవంలో 1.5 లక్షల మంది ప్రజలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 200 మంది ట్రబుల్ మాంగర్స్‌ను, నాటుసారా అమ్మే వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. కార్డెన్ సెర్చ్‌లో నాటుసారాతో పాటు 340 రింగుల కర్రలు సీజ్ చేశామన్నారు. దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు, 10 పికెట్లు ఏర్పాటు చేసి భద్రత కల్పించామని తెలిపారు. ఈ ఉత్సవాలకు ఇద్దరు ఏఎస్పీలు, ఏడుగురు డీఎస్పీలు, 700 మది పోలీసులతో పటిష్ట భద్రతను కల్పించామని తెలిపారు. చిన్న పిల్లలు, తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు.

నకిలీ వెబ్‌సైట్లను నమ్మి మోసపోవద్దు

- మేనేజర్లు శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి

మంత్రాలయం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులు వివిధ పేర్లతో నకిలీ వెబ్‌సైట్లను నమ్మి గదులను బుక్ చేసుకోవద్దని మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్ జోషి అన్నారు. బుధవారం బెంగుళూరుకు చెందిన నివేదిత అనే భక్తురాలు సుజీంద్ర గెస్టుహౌస్ పేరుతో రూ.4వేలు చెల్లించి మోసపోయామని మఠం మేనేజర్ వెంకటేశ్ జోషికి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా మేనేజర్లు మాట్లాడుతూ వీవీజీ పేరుతో రూ.3వేలు, మరో భక్తుడు రూ.2వేలు నకిలి వెబ్‌సైట్లకు చెల్లించి మోసపోయారని తెలిపారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం వెబ్‌సైట్ తప్ప మరో వెబ్‌సైట్‌లో రూముల కోసం మఠం వారు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. రెండు నెలలుగా సుజీంద్ర, ఈఈజీ, విజయ్ విఠల్, భీరేంద్ర, వసతి గృహాల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి డబ్బులు వసూలు చేస్తున్నారని, భక్తులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ప్రతి పైసాకు శ్రీమఠం రసీదు చెల్లిస్తుందని, ఇది భక్తులు గమనించాలని కోరారు. సీఆర్వో ఐపీ నరసింహమూర్తి, విజయేంద్రాచార్, బద్రినాథ్ ఉన్నారు.

పింఛన్ల పంపిణీలో రగడ

మహానంది, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుక్కాపురంలో పింఛన్ల పంపిణీలో బుధవారం తెలుగు తమ్ముళ్ల మధ్య రగడ జరిగింది. గ్రామంలో అధికారులు పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు తమ్ముళ్లు పంచాయతీ కార్యాలయం ముందు బాహాబాహీగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈఘటనను చూసిన గ్రామస్థులు భయాందోళన చెందారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక బుక్కాపురంలో తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గపోరు ఏర్పడింది. ఆధిపత్య పోరు వల్లే ఈ దాడులు జరిగాయని గుసగుసలు వినిపిస్తు న్నాయి. చివరకు ఇరువర్గాల మధ్య సఖ్యత చేసినట్లు సమాచారం. ఈవిషయంపై ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా బుక్కాపురం దాడులపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉయ్యాలవాడ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం ఓవృద్ధురాలు మృతిచెందినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని కొండుపల్లెకి చెందిన నారాయణమ్మ(55) భర్త శివశంకర్‌రెడ్డి ఆడపిల్లల బంగారు తాకట్టు పెట్టి అప్పులు చేశాడు. దీంతో మనస్థాపానికి గురైన నారాయణమ్మ మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్ప డింది. కుటుంబీకులు గమనించి హుటాహుటిన నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

చెరువులను నింపండి : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువులను నింపి, భూగర్భజలాలను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జలవనరులు, భూగర్భ జలశాఖ, డ్వామా అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 11 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు మరమ్మతులు చేయించి హంద్రీ నీవా నీటితో నింపాలని ఎస్ఈ బాలచంద్రా రెడ్డిని ఆదేశించారు. మద్దికెర, ఆస్పరి తదితర మండలాల్లో వేసవిలో తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్ఈలు బాలచంద్రారెడ్డి, పాండురంగయ్య పాల్గొన్నారు.

రైతు సాధికారతతోనే దేశం సుసంపన్నం

కోడుమూరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికారతతోనే దేశం సుసంపన్నంగా ఉంటుందని జేడీఏ వరలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ప్యాలకుర్తి గ్రామంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గించడంతో వ్యవసాయ, డ్రిప్పు, ఆక్వాకల్చర్, సూక్ష్మపోషకాలు, పాలక్యాన్ల ధరలు తగ్గాయన్నారు. జీఎస్టీ విలువపై రైతులకు అవగాహన ఉండాలని, లేకుంటే మోసాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, జీఎస్టీ అధికారి రమాదేవి తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో రాముడు, ఏవో రవిప్రకాష్, హార్టికల్చర్ అధికారి మదన్‌మోహన్ పాల్గొన్నారు.



వ్యవసాయ పరికరాలను ప్రదర్శిస్తున్న అధికారులు

క్రీడలతో మానసికోల్లాసం

- జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేజీ.గంగాదర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కేజీ.గంగాదర్‌రెడ్డి అన్నారు. కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు గ్రామంలో బుధవారం టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అతిథులుగా సర్పంచ్ బాలపీరా, ఎంపిటీసీ శ్రీను, పంచలింగాల నాయకుడు ఈడిగ శ్రీనివాసులు, న్యాయవాది మోహన్‌క్రిష్ణ పాల్గొన్నారు. క్రీడాకారుడు రామక్రిష్ణయాదవ్, రామాంజనేయులు, గౌండరాజు, నిర్వాహకులు మిన్నెల్ల,శేఖర్,శివ, సతీష్, మౌలాలి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ రజతోత్సవ వేడుకలు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ ఏర్పాటుచేసి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ వేడుకలను ప్రకాష్‌నగర్ జీఎం కార్యాలయం, కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహిం చారు. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ మాట్లాడుతూ అక్టోబర్ 1న 2000లో ప్రభుత్వరంగ పబ్లిక్ సెక్టార్ యూనిట్‌గా రూపుదిద్దుకున్న సంస్థ మారుమూల గ్రామాలకు ల్యాండ్ లైన్, బ్రాడ్‌బ్యాండ్ సేవలను అందిస్తోందన్నారు. కొత్తగా ట్రిపుల్ ప్లే సర్వీసులను ప్రారంభించామని ఒకే ఫైబర్‌నెట్ ద్వారా ఇంటర్నెట్, వైఫై, టెలిఫోన్, టీవీ, ఓటీటీ సర్వీసులను అందిస్తుందన్నారు. డీజీఎం సాయినాథ్, ఏజీఎంలు వి.శ్రీనునాయక్, దేవచంద్‌నాయక్, లక్ష్మనాయక్, మురళీకృష్ణ, నారాయణస్వామి, వి.జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

కర్నూలు అర్బన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యంగా పని చేస్తున్నారని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని బిర్లాగడ్డలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణ, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌తో కలిసి పించన్లను పంపిణీ చేశారు. త్వరలో ఆటో డ్రైవర్ల ఖాతాల్లో రూ.15 వేలు ప్రభుత్వం జమచేస్తుందన్నారు. నాయకులు సత్రం రామకృష్ణ, రాజశేఖర్, సుధాకర్‌రెడ్డి, బోయ మధు, బాలు తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు బిర్లాగడ్డలో పింఛన్ పంపిణీ చేస్తున్న సోమిశెట్టి

దుర్గా నవరాత్రులు

నేటి అలంకారం
శ్రీ రాజరాజేశ్వరీదేవి

ఆశ్వయుజ శుద్ధ దశమి (విజయదశమి) గురువారం

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు శరన్నవరాత్రి మహోత్సవాల్లో చివరి రోజైన విజయదశమి నాడు శ్రీ రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారు. సకల భువన బ్రహ్మాండాలకు అధిదేవత ఆమె. షోడశ మహామంత్ర స్వరూపిణి అయిన అమ్మను మహాత్రిపుర సుందరిగా, అపరాజితాదేవిగా భక్తులు ఆరాధిస్తారు. అపరాజితాదేవి పేరు మీద 'విజయదశమి' ఏర్పడింది. విజయాన్ని సాధించింది కాబట్టి 'విజయ' అని అంటారు. పరమ శాంత స్వరూపంతో, చిరునవ్వులు



చిందిస్తూ, చెరుకుగడ చేతితో పట్టుకుని ఆమె దర్శనమిస్తుంది. మణిద్వీపంలో శ్రీపురంలో నివాసం ఉండే ఆమెను 'చింతామణి'గా పిలుస్తారని ప్రతీతి. పరమేశ్వరుడి అంకం ఆసనంగా... ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులను భక్తులకు అనుగ్రహిస్తుంది. యోగమూర్తిగా మాయామోహిత మానవ చైతన్యాన్ని ఉద్దీపనం చేస్తుంది. అనంత శక్తి స్వరూపమైన శ్రీ చక్రానికి ఈ తల్లి అధిష్ఠాన దేవత. ఆమెను కొలిస్తే సమస్త శక్తులూ సమకూరుతాయనీ, ఆ అమ్మ భక్తుల కోరికలను నెరవేరుస్తుందనీ, మనసారా కొలిస్తే బ్రహ్మజ్ఞానం కలుగజేస్తుందనీ నమ్మిక. అమ్మవారిని ఎరుపు రంగు గాజులతో అలంకరించి, కుంకుమార్చన చేయడం శ్రేష్ఠం.

నైవేద్యం: పరమాన్నం, ఆరు రుచులతో కూడిన (షడ్రసోపేత) పదార్థాలు

అలంకరించే చీర రంగు: ఆకుపచ్చ, తెలుపు

అర్చించే పూల రంగు: ఎరుపు

పారాయణ చెయ్యాల్సింది: లలితా సహస్రనామం

అర్చన: ఎర్రటి గాజులతో అలంకరించి, కుంకుమార్చన

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

- మహాదుర్గాదేవిగా భక్తులకు దర్శనం

కర్నూలు కల్చరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని ఆలయాల్లో బుధవారం రాత్రి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. నెహ్రూరోడ్డులోని సత్యసాయి మందిరంలో అమ్మవారికి మహిషాసుర మర్దిని అలంకరణ చేశారు. అంతకుముందు మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కల్లూరు వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ చేశారు. చిత్తారివీధిలోని నిమిషాంబ దేవి ఆలయంలో మహిషాసురమర్దినిగా దర్శనం ఇచ్చారు. పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని శ్రీలలితా పీఠంలో కొనసాగుతున్న తిరుమల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామికి రథోత్సవం నిర్వహించారు. కోలాటం నృత్యాలు, భజనలు నిర్వహించిన శ్రీ భగవతి కోలాట బృందం, అనామిక రెడ్డి బృందంలోని మహిళామూర్తులను పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్య స్వామిసత్కరించారు. సప్తగిరినగర్‌లోని అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో గల శ్రీచౌడేశ్వరి దేవి నూతన దుర్గాదేవి అలంకరణ చేశారు.



పెద్దఅమ్మవారిశాలలో మహిషాసురమర్దిని..



చిన్న అమ్మవారిశాలలో రాజరాజేశ్వరి దేవి



లలిత పీఠంలో దేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి రథోత్సవం

కలెక్టర్‌ను కలిసిన ఎస్వీ



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ డా.ఏ.సిరిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో బొకేను అంజేసి, అభివృద్ధి పనులు, దేవరగట్టు ఉత్సవాలను చర్చించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. బుధవారం బకాయిలు విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ పోస్టుబాక్స్‌లో పోస్టు కార్డులను పంపించారు. కార్మిక శాఖలో పెండింగ్ ఉన్న క్లైయిమ్స్‌ను విడుదల చేయాలన్నారు. జి.చంద్రశేఖర్, రహిమాన్, నల్లన్న, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

పాత ధరలకు విక్రయిస్తే చర్యలు

- జీఎస్టీ తగ్గించిన ధరలకే విక్రయించాలి
- సి.క్యాంపు రైతు బజార్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



రైతు బజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని, వ్యాపారులు పాత ధరలకే వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా.ఏ.సిరి హెచ్చరించారు. బుధవారం సి.క్యాంపు రైతుబజారులో నిత్యాసర దుకాణాలరె తనిఖీ చేశారు. గతంలో నిత్యావసరాల ధరలు, ప్రస్తుం ఇస్తున్న ధరలను ఆరా తీశారు. ధరల వివరాలను బోర్డులో నమోదు చేయాలన్నారు. జీఎస్టీ తగ్గింపును దుకాణాదారులు అమలుచేస్తున్నారో లేదో తనిఖీలు చేయాలని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మను ఆదేశించారు. హార్టికల్చర్ అసిస్టెంట్ శివకుమార్ సివిల్ సప్లయ్ డీఎం రాజారఘువీర్, సెక్యూరిటీ గార్డులు శ్రీనివాసరెడ్డి, హనుమంతు, గోపాల్, చిన్నస్వామి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు సూపర్ గిఫ్ట్

ఓర్వకల్లు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించి పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం హుశేనాపురంలో ప్రజలు, దుకాణదారులకు అవగాహన కల్పించారు. కేవీ మధు, బజారు, వేణు పాల్గొన్నారు.



పోస్టర్లతో అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్

4 నుంచి సౌత్ ఇండియా లాక్రోస్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో ఈ నెల 4వ తేదీ నుంచి 5వ తేదీ వరకు 1వ సీనియర్ సౌత్ ఇండియా లాక్రోస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు సురేంద్ర, వజ్రరాజు తెలిపారు. బుధవారం డా.శంకర్‌శర్మకు ఆహ్వాన పత్రికను అందజేశారు. డా.శంకర్‌వర్మ మాట్లాడుతూ లాస్ ఏంజిల్స్‌లో 2028లో నిర్వహించనున్న ఒలంపిక్స్‌కు కర్నూలు నగరం నుంచి ఎక్కువ మంది క్రీడాకారులను పంపాలన్నారు. వజ్రరాజు, శివ, హరి, భరత్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సూపర్‌సిక్స్ పథకాలు

- పింఛన్లు పంపిణీ చేసిన గౌరుచరితారెడ్డి



ఫరూక్‌నగర్‌లో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కల్లూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): అర్హతగల ప్రతి కుటుంబానికి సూపర్‌సిక్స్ పథకాలను సీఎం చంద్రబాబు ఇచ్చారని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. బుధవారం 35వ వార్డు ఫరూక్‌నగర్‌లో ఎన్టీఆర్‌భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి మామీని అమలు చేసి సూపర్‌సిక్స్‌ను సూపర్‌హిట్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. పింఛన్ పెంపు, తల్లికివందనం, మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, మోగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ అమలు చేసి చూపించామన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కె.పార్వతమ్మ, పియూ.మాదన్న, రవిప్రకాష్‌రెడ్డి, ఎస్.ఫిరోజ్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఉపశమనం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్నివర్గాల ప్రజలకు ఉపశమనం కలిగిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. బుధవారం నందికొట్కూరు రోడ్డు డీమార్ట్ షోరూంను సందర్శించి సీఎస్టీ సంస్కరణల అమలును ఆరా తీశారు. జీఎస్టీ 2.0తో నిత్యావసర ధరలు 10 నుంచి 20శాతం తగ్గాయని, ప్రజలు స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పెంపుతో ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపితే టీడీపీ ట్రూడౌన్‌తో విద్యుత్ చార్జీలు తగ్గించిందన్నారు. కె.పార్వతమ్మ, డి.రామాంజనేయులు, ఎస్.ఫిరోజ్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పెయిన్‌లెస్ లేబర్ క్లినిక్

- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజ వైద్యశాల ప్రసూతి విభాగంలో నొప్పిలేని(పెయిన్‌లెస్) ప్రసవాల క్లినిక్‌ను సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధటుగా ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాలు కల్పించామన్నారు. కాన్పు సమయంలో నొప్పి లేకుండా, సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రసవం చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఆధునిక వైద్య సాంకేతిక పద్ధతుల ద్వారా గర్భిణులకు భరోసా కల్గించేలా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అదే విధంగా క్యాన్సర్ విభాగంలోకూడా రోగుల నొప్పి నివారణకు పెయిన్‌లెస్ క్లినిక్ ప్రారంభించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, గైనిక్ విభాగం హెచ్‌వోడీ డా.సావిత్రి, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.రామ శివ నాయక్, అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధ పూజ


ఎమ్మిగనూరులో సంప్రదాయ దుస్తుల్లో ఆయుధ పూజలో పాల్గొన్న పోలీసులు

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఆయుధాలు, వాహనాలను పెట్టి పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే పోలీస్ వాహనాలు, వారి ద్విచక్రవాహనాలపై పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. పోలీసులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసులు సహపంక్తి భోజనం చేశారు. ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, ఎర్రన్న, కిష్టప్ప, పోలీసులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయం పుణ్యక్షేత్రంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో వాహనాలకు, ఆయుధాలకు, రథోత్స వాలకు పూజలు చేశారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం నవమి సందర్భంగా పూజలు చేశారు. అలాగే మంత్రాలయం, మాధవరం పోలీస్ స్టేషన్లలో ఆయుధ పూజ నిర్వహించారు.

వాషింగ్ మిషన్లు అందజేత

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద బీజేపీ జిల్లా కార్యదర్శి దయాసాగర్, బీజేపీ నాయకులు నారాయణ బుధవారం లబ్ధిదారులకు వాషింగ్ మిషన్లు అందజేశారు. పట్టణంలోని 22, 23, 24వ వార్డులలో చాకలి కులవృత్తుల లబ్ధిదారులకు వాషింగ్ మిషిన్‌లతో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న సర్టిఫికెట్లు అందజేశారు. లలిత్ జైన్, చరణ్, బడేసాబ్, శిల్పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలు కాపాడడానికి రూ.40 వేలు విలువ చేసే ఆరు ఇంజెక్షన్లు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైనన్నీ అందుబాటులో ఉంచుతామన్నారు. గతనెలలో ఒక్కటే దాదాపు రెండువేల మందికి వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. పాత భవనంలో మరమ్మతులు చేపట్టి వినియోగానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సుధ, డాక్టర్ ఆదినాగేశ్, హెచ్‌డీసీ సభ్యులు రామకృష్ణ నాయుడు, సురేష్ చౌదరి, అంబేడ్కర్, నాయకులు కమ్మ మహేంద్ర బాబు, మాచాని మహేశ్, నరసింహులు, కటారి రాజేంద్ర, మిన్నప్ప, నరసన్న గౌడ్, బీజేపీ నరసింహులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు బుధవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే స్వగృహం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిని లారీ ఓనర్స్ అసోషియేషన్‌కు చెందిన యూసుఫ్, 27వ వార్డుకు చెందిన బాబు, పెద్దమరివీడుకు చెందిన దస్తగిరి, 8వ వార్డుకు చెందిన రవితేజలతో పాటు వారి అనుచరులు టీడీపీలో చేరారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బీవీ

శివన్ననగర్‌లో పర్యటన: పట్టణంలోని శివన్ననగర్, టిడ్కో గృహాల సముదాయంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పర్యటించారు. స్థానిక శివన్న నగర్‌లో చేనేతల ఇళ్లలో ఉన్న మగ్గాల గుంతల్లోకి చేరిన వర్షం నీటిని చూశారు. అలాగే లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. అలాగే టిడ్కో గృహాల సముదాయంలో రూ. 1కోటితో ఏర్పాటు చేయనున్న చేనేతశాలకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం 5వ వార్డులో ఎమ్మెల్యే బీవీ, బీజేపీ నాయకుడు నరసింహులతో పాటు వార్డుప్రజలతో కలిసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాచాని మహేశ్, మాజీ కౌన్సిలర్ రంగస్వామి గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ప్రయోజనం

● జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి

గోనెగండ్ల, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల వ్యవసాయశాఖ పరికరాలపై జీఎస్టీ తగ్గించడంతో ప్రయోజనం చూకూరుతుందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, జీఎస్టీ అధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం హెచ్‌కైరవాడి గ్రామంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అనంతశయన, సహకారం సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి, టీడీపీ నాయకులు గురునాథ్‌రెడ్డి, రాజేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి పులిరాజు, రాంగోపాల్ పాల్గొన్నారు.

కౌతాళం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ 2.0తో పేదలకు ప్రయోజనం కలుగుతుందని కౌతాళం ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్, ఏవో శేషాద్రి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళం రైతు సేవా కేంద్రంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌కు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. జీఎస్టీ ఏసీటీవో నాయక్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి వరలక్ష్మి

క్రీడలతో మానసికోల్లాసం

● టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు


నందవరంలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దేశాయి

నందవరం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు అన్నారు. నందవరంలో హరే శ్రీనివాస యూత్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం దేశాయి కబడ్డీ ఆడి పోటీలను ప్రారంభించారు. గెలిచిన జట్లకు మొదటి బహుమతి రూ. 10,016, రెండో బహుమతి రూ. 5,016, మూడో బహుమతి రూ.3,016 దేశాయి మాధవరావు నగదు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు లచ్చప్పనాయుడు, వెంకటేశ్వర్లు, బెస్త ఈరన్న, శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి సీఎం కృషి

● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి


వందగల్లులో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

కోసిగి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారని టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. నేలకోసిగి గ్రామంలో ఇంటింటికి తిరిగి వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఈశ్వరయ్య స్వామి, వీఆర్వో బసవరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వందగల్లులో ఏవో ఎం.వర ప్రసాద్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ పైన రాఘవేంద్ర రెడ్డి, టీడీపీ నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు. వందగల్లు గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాలకు నిర్మాణంలో ఆగిపోయిన తరగతి గదులను, పాఠశాలకు రోడ్డు సమస్య గురించి ప్రజలు తెలిపారు. త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. నాయకులు నాడిగేని అయ్యన్న, చింతలగేని నర్సారెడ్డి, రామకృష్ణ, చిన్నతాయన్న, వీరారెడ్డి, శంకర్, పంపాపతి, నరసింహులు, చిన్నారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ సీఐగా చిరంజీవి బాధ్యతలు

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల రూరల్ సీఐగా చిరంజీవి గురువారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయనను రూరల్ ఎస్ఐ కె.శ్రీనివాసులు, నందవరం ఎస్ఐ కేశవ, మండలంలోని టీడీపీ, వైసీపీ నాయకులు కలిశారు.

రక్తదాన శిబిరం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బుధవారం పట్టణ ఏరియా ఆసుపత్రిలో ఏఐవైఎఫ్ మంత్రాలయం అధ్యక్షుడు జాఫర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధ, సివిల్ సర్జన్ అదినాగేశ్, డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ హేమంత్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, భాస్కర్ హాజరయ్యారు. రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సందర్శించి రక్తదాతలను అభినందించారు. వైద్య సిబ్బంది రాజు, మురళి, విజయ్ పాల్గొన్నారు.

వైభవంగా హోమం


హోమం నిర్వహిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛ రణాలు, మంగళ వాయి ద్యాల మధ్య దుర్గా హోమం నిర్వహించారు. బుధవారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి దుర్గా హోమం, వాయుస్తుతి వంటి నవగ్రహ హోమాలు నిర్వహించారు. పీఠాదిపతి పూర్ణాహుతి చేసి భక్తులను ఆశీర్వదించారు.

వేంకటేశ్వర స్వామి పల్లకీ సేవ

కౌతాళం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం వేంకటేశ్వర స్వామి పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భక్తుల కోలాటాలు, భజనల మధ్య కొనసాగింది.

కందనాతి మారెమ్మ దేవి ఉత్సవం

కోసిగి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని కడాపాలెం తిమ్మప్పకొండ సమీపంలో ఉన్న కందనాతి మారెమ్మ దేవి వెండి ప్రతిమను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఉదయం నుంచే ఆలయ నిర్వహకులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మద్దికెర అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉల్లి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎంపీపీ అనితాయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ యాదవ్ కోరారు. బుధవారం స్వగృహంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం హెక్టారుకు రూ.50వేలు ప్రకటించినా రైతులకు ఎలాంటి లాభం ఉండదన్నారు. రైతులు ఎకరాకు దాదాపు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టారని అన్నారు. ప్రభుత్వం హెక్టారుకు రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది వర్షాలు అధికం కావడం వల్ల రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా కుళ్లిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పంట నష్ట నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలన్నారు. రబీ ప్రారంభమవుతున్నా ఇంత వరకు పప్పుశనగ విత్తనాలు ఇవ్వలేదని, కనీసం ధర కూడా నిర్ణయించలేదన్నారు. రైతులు 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పప్పుశనగ విత్తనాలు 80 శాతం రాయితీతో ఇవ్వాలన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు టైలర్ గోపాల్ తదితరులు ఉన్నారు.

దైవమార్గంలో నడవాలి

- సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వ్యవస్థాపకుడు విజయ్ ప్రసాద్ యాదవ్

మద్దికెర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వ్యవస్థాపకులు విజయ్ ప్రసాద్ యాదవ్ అన్నారు. బుధవారం మద్దికెర గ్రామంలోని మద్దమ్మకుంట సమీపాన వెలసిన సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో పంచాయతీ, విద్యుత్, హమాలీలు, వీఆర్ఏలు దాదాపు 200 మందికి నవంబరులో జరిగే షష్టి ఉత్సవాల్లో భాగంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొంత సమయాన్ని దైవ సన్నిధిలో కేటాయించాలన్నారు. దేవాలయ అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. మద్దికెర గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో రాతి దేవాలయ నిర్మాణం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు, ప్రజలు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రజలకు వరం

మద్దికెర అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ధరలను తగ్గించడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, వ్యాపారులకు ఓ వరం లాంటిదని జడ్పీటీసీ మాజీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, మండల టీడీపీ అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం ఆయన పింఛన్లు పంపిణీ చేస్తూ విలేకరులతో మాట్లాడారు. దసరా పండుగ సందర్భంగా జీఎస్టీ తగ్గింపు అమలులోకి రావడంతో పేదలకు అందుబాటులో వస్తువులు వచ్చాయన్నారు. అన్ని రైతులకు కూడా ఈ జీఎస్టీ తగ్గడం వల్ల ట్రాక్టర్లు, పరికరాలు తక్కువ ధరకే అందుతాయన్నారు. టీడీపీ నాయకులు రామాంజులు, పారా విరోభ, విజయకుమార్, సాయినగర్ బాషా ఉన్నారు.

డీపీవో తనిఖీ

వెల్దుర్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ పనులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం రత్నపల్లి, యాదరాళ్ల గ్రామాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐవీఆర్ఎస్ కాల్స్ శానిటేషన్ గురించి అధికారులను ఆరాతీశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్, సర్పంచి ఆనంద్ పాల్గొన్నారు.















దేవరగట్టులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

బన్నీ ఉత్సవాలకు సర్వం సిద్ధం

● ఏర్పాట్లు పరిశీలించిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

హొళగుంద, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్ బుధవారం అన్నారు. దేవరగట్టులో ఆదోని డివిజన్ స్థాయి అధికారులతో, గ్రామస్థులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేవాలయ ప్రాంగణం నుంచి ఎదురు బసవన్న గుడి వరకు 100 సీసీ కెమెరాలు, 800 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు తాగునీటి కొరత లేకుండా 2.5 లక్షల వాటర్ పాకెట్లు, తాగునీటి ట్యాంకర్లతో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 20 పడకల తాత్కాలిక ఆసుపత్రి, అంబులెన్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మద్దికెర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మీ నారాయణ, తెలుగు యువత నాయకులు గుడి ఎల్లప్ప అన్నారు. బుధవారం మద్దికెర గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసే సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విదంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరికీ రూ.4వేలు పింఛన్లు ఇస్తున్నారనీ తెలిపారు. పింఛన్లు ఇంటింటికి వెళ్లి ఇస్తున్నామన్నారు. వైసీపీ నాయకులు పింఛన్ల పంపిణీపై గగ్గోలు పెట్టారనీ, పింఛన్లు పంపిణీ సవ్యంగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు





బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర

తుగ్గలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): పత్తికొండలో బియ్యం లారీ, ఆటో డీకొనడంతో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, తిమ్మయ్య చౌదరి, ట్రైబల్ రాష్ట్ర వెల్ఫేర్ సలహా మండలి సభ్యులు వెంకటపతి అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముక్కెళ్లకు చెందిన ఇద్దరు మహిళలు, ఒక చిన్నారి ఆటోలో వస్తుండగా.. బియ్యం లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారనీ ఈ ఘటన చాలా కలిచివేసిందని, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు బాదిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారనీ అన్నారు. వారికి అన్ని విదాలా అండగా ఉండటంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం అందేలా చూస్తామని, ఘటనకు కారకులైనల వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు కూడా సూచించామన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



జొన్నగిరిలో ఆయుధ పూజ చేస్తున్న విద్యుత్ అధికారులు

తుగ్గలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా ఆయుధ పూజ పురస్కరించుకుని వారు వారి ఉపయోగించే ఆయుదాలకు పూజలు చేశారు. బుధవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐలు బాలనరసింహులు, మల్లికార్జున, విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ ఏఈ సుజాత, లైన్ ఇన్స్‌పెక్టర్ మల్లికార్జున విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లకు పోలీసులు ఆయుధాలకు పూజలు చేశారు. మండలంలోని ఆయుధపూజ నిర్వహించారు. లైన్‌మెన్ నాగరాజు, భీమేష్, రవి, రామ్‌సింగ్ నాయక్ ఉన్నారు.

మహిషాసుర మర్దిని అలంకారంలో అమ్మవారు


మద్దికెర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మద్దికెర, పెరవలి గ్రామంలోరంగనాథస్వామి, నగరేశ్వరస్వామి, చౌడేశ్వరి దేవి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రాజ్యలక్ష్మీదేవి అమ్మవారిని, చౌడేశ్వరిదేవీని బుధవారం మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు వీరయ్య, ముత్యాల రాజశేఖర్, సుంకు రవి, పెద్ద కోట రమేష్ భక్తులు తదితరులున్నారు.













సూపర్ జీఎస్టీపై అవగాహన

వెల్దుర్తి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పన్నుల తగ్గింపుపై బుధవారం ఎంపీడీఓ సుహాసినమ్మ వెల్దుర్తిలో ఉన్న కిరాణాషాపులు, ఆటోమొబైల్ షాపులు, ఇతర దుకాణాదారులకు అవగాహన కల్పించారు. తగ్గిన జీఎస్టీ పన్ను ఫలాలు ప్రజలకు అందాలని తెలిపారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో తగ్గిన జీఎస్టీ పన్నుల గురించి ఏవో అక్బర్‌బాషా రైతులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రవికిశోర్ పాల్గొన్నారు.

రాజకీయ దురంధరుడు కేఈ కృష్ణమూర్తి

(మొదటి పేజీ తరువాయి)



నాటి ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. 1996లో కర్నూలు ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందిన కేఈ 1999లో విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. 2009లో డోన్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా విజయం అందుకున్నారు. 2014 ఎన్నికల్లో పత్తికొండ నుంచి పోటీచేసి విజయం సాధించారు. చంద్రబాబు మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ బాధ్యతలు చేపట్టారు. తనకుమారుడు కేఈ శ్యాంబాబును రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆకాంక్షతో 2019లో పత్తికొండ నుంచి కొడుకును బరిలో దింపి రాజకీయాలకు స్వల్ప విరామం ఇచ్చారు. అయినా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు.

కందనవోలు ప్రగతిలో తనదైన ముద్ర



తిరుమల శ్రీవారి సన్నిధిలో కేఈ కృష్ణమూర్తి (ఫైల్)

మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా డోన్, పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. డోన్, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో కరువు తాండవిస్తుంది. హంద్రీనీవా కాలువ నియోజకవర్గం సరిహద్దులు దాటిపోతున్నా సాగునీరు అందని దైన్యం. 2014 తరువాత అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి 106 చెరువులకు కృష్ణాజలాలు మళ్లించాలనే సంకల్పంతో రూ.250కోట్లు మంజూరు చేయించారు. పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోజు చెరువులు జలకళ సంతరించుకున్నాయంటే ఆ రోజు కేఈ కృష్ణమూర్తి కృషి మరవలేనిది. పత్తికొండ పట్టణానికి తాగునీటి సమస్య నివారణకు పందికోన జలాశయం నుంచి పైపులైన్ వేయించారు. ఆయన చేసిన ప్రగతి పనులు ఎన్నో. డోన్ ఎమ్మెల్యేగా నియోజకవర్గం అభివృద్ధి కోసం ఎనలేని సేవలు చేశారు. ఎంపీగా పార్లమెంట్‌లో అడుగు పెట్టిన ఆయన మంత్రాలయం - కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు రైల్వే లైన్ నిర్మాణం ఆవస్యకతను వివరించి సర్వేకు నిధులు మంజూరు చేయించారు. ఎంపీ నిధులతో పల్లెపల్లెకు బస్ షెల్టర్‌లు నిర్మించారు. కర్నూలు నగరంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి శాశ్వత భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. పలు గ్రామాలకు రహదారులు నిర్మించారు.

ఘనంగా ఆయుధ పూజ

మద్దికెర, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పోలీస్, విద్యుత్ సబ్ స్టేషన్లు తదితర కార్యాలయాలు, గ్రామాల్లో విజయదశమి సందర్భంగా బుదవారం ఆయుధాల పూజను ఘనంగా జరుపుకున్నారు. బుదవారం ఆయా కార్యాలయాల్లోని ఆయుధాలకు పూజలు చేశారు. అలాగే గ్రామంలోని దసరా సందర్భంగా యాదవరాజులైన పెద్ద నగిరి, చిన్ననగిరి, యామన్నగిరికి చెందిన యాదవరాజులు గ్రామ శివారులో అశ్వాల పారువేటను దృష్టిలో ఉంచుకుని అశ్వాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేశారు. అలాగే ఆయుధాల పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.



మద్దికెరలో ఆయుధాల పూజ చేస్తున్న దృశ్యం

వ్యవసాయ యంత్రీకరణ పరికరాలపై జీఎస్టీ తగ్గింపు



రైతులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పత్తికొండ టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రీకరణ పరికరాలపై 12 శాతం నుంచి 5 శాతానికి జీఎస్టీ తగ్గించడం జరిగిందని, వ్యవసాయ శాఖ ఏడీఏ మోహన్ విజయ్ కుమార్, ఏఓ వెంకటరాముడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జూటూరు, చిన్నహుల్తి గ్రామాల్లో జీఎస్టీపై రైతులకు సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రైతులకు నాలుగు స్లాబులను 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. దీంతో 5 శాతం ప్రకారం రైతులకు వ్యవసాయ ట్రాక్టర్‌లకు, వ్యవసాయ యంత్ర పరికరాలకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల విక్రయాలపై జీఎస్టీ 5 శాతం లావాదేవీలు జరిగేలా ప్రకటించడం జరిగిందన్నారు. అనంతరం చిన్నహుల్తి గ్రామంలో రైతులతో, ట్రాక్టర్ పరికరాలతో ర్యాలీ నిర్వహించి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదోని సేల్స్ ట్యాక్స్ శాఖ అధికారి సందీప్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఖాజాహుసేన్, చిన్నహుల్తి పాల్గొన్నారు.

హెలిప్యాడ్ పనుల పరిశీలన



హెలిప్యాడ్‌లో ప్రారంభమైన పనులు

శ్రీశైలం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 16న ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం రానున్న నేపథ్యంలో హెలిప్యాడ్ పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆర్డీవో నాగజ్యోతి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు సున్నిపెంటలో గల హెలిప్యాడ్ గ్రౌండ్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనులపై పలు సూచనలు చేశారు. నాలుగు నుంచి ఐదు వరకు హెలిప్యాడ్ గ్రౌండ్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. పారిశుధ్య పనుల్లో లోపాలు లేకుండా సరిచూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి పనులను త్వరగా పూర్తి చేయించాలన్నారు.

రీసర్వే ప్రాజెక్టులో 35 గ్రామాలు ఎంపిక

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఆంధ్రప్రదేశ్- రీసర్వే ప్రాజెకు మూడో ఫేస్‌లో నంద్యాల జిల్లాలో 35 గ్రామాలు ఎంపికయ్యాయని జేసీ సి.విష్ణుచరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రీసర్వేలో భాగంగా ఈ నెల 3న ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులకు నోటీసులు అందజేశారని, సంబంధిత రైతులు తమ వద్దనున్న డాక్యుమెంట్లు, ఫొటోలు ఇతర సాంకేతిక వివరాలను సర్వే బృందానికి అందించాలని సూచించారు.

రాజకీయ దురంధరుడు కేఈ కృష్ణమూర్తి

ఉమ్మడి కర్నూలు జిల్లా రాజకీయాల్లో కీలక భూమికి పోషించిన నాయకుడు మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి. 45ఏళ్లకు పైగా సుదీర్ఘ రాజ కీయ అనుభవం కలిగిన నేత ఆయన. ఎన్నికలు ఏవైనా.. ప్రత్యర్థులు ఎంతటివారైనా ఎదురొడ్డి పోరాడి అద్భుత విజయాలు అందుకున్న చరిత్ర ఆయన సొంతం. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, ప్రస్తుత అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కందనవోలు ప్రగతిలో తనదైన ముద్ర వేశారు. డోన్, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో నిత్యం కరువు తల్లడిల్లె పల్లెసీమలకు హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు మళ్లించాలని సంకల్పించారు. టీడీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం చంద్రబాబును ఒప్పించి రూ.250 కోట్లు మంజూరు చేయించి 106చెరువులు నింపే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2019 ఎన్నికల్లో కుమారుడు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు రాజకీయ వారసత్వం అందించి రాజకీయాలు నుంచి విరామం తీసుకున్నా పల్లెప్రగతి కోసం సలహాలు ఇస్తూ కుమారుడిని నడిపిస్తున్నారు. జిల్లా పెద్దాయనగా, అసాధారణ రాజకీయ దురంధరుడు మాజీ డిప్యూటీ సీఎం, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కేఈ కృష్ణమూర్తి 87వ జన్మదినం జరుపుకుంటున్న శుభసందర్భంగా ఆయన రాజకీయ ప్రస్థానం, జిల్లా అభివృద్ధిలో కీలక భూమికపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- తండ్రి కేఈ మాదన్న వారసుడిగా రాజకీయ అరంగేట్రం
- ఎమ్మెల్యే, ఎంపీగా చట్టసభల్లో అడుగు
- మంత్రి, ఉప ముఖ్యమంత్రిగా సేవలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రగతిలో తనదైన ముద్ర
- కరువు ప్రాంతానికి కృష్ణాజలాలు మళ్లించిన భగీరథుడు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో కేఈ కృష్ణమూర్తి (ఫైల్)

కర్నూలు/పత్తికొండ, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామానికి చెందిన కేఈ మాదన్న, మద్దన్న దంపతులకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం. వారిలో అగ్రజడు కేఈ కృష్ణమూర్తి. 1983 అక్టోబరు 2న జన్మించారు. పల్లెబడిలో అక్షరాలు దిద్దిన ఆయన తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ పూర్తిచేశారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం సాగర్ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్య పూర్తిచేసి ఎల్ఎల్‌బీ పట్టా అందుకున్నారు. కొన్నాళ్లు కర్నూలు, హైదరాబాద్‌లో న్యాయవాది వృత్తిలో కొనసాగారు. ఆ తరువాత కొన్నాళ్లు హైదరాబాద్‌లో ఆల్విన్ సంస్థలో ప్రముఖ హోదాలో ఉద్యోగం చేశారు. చిన్నప్పటి నుంచి నాయకత్వ లక్షణాలు పుణికి పుచ్చుకున్న కేఈ కృష్ణమూర్తి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేగా, కర్నూలు జిల్లా సమితి అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వర్తించిన తండ్రి కేఈ మాదన్నకు రాజకీయంగా తోడుగా నిలిచారు. గ్రామీణ రాజకీయాల్లో పట్టు సాధించారు. తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ తన 40వ ఏటా కేఈ మాదన్న వారసుడిగా 1978లో ప్రత్యేక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తనదైన రాజకీయ గుర్తింపు పొందారు. అంశం ఏదైనా ముక్కుసూటిగా మాట్లాడేతత్వం కలిగిన కేఈ ఆయా పార్టీల అగ్రనాయత్వానికి చేరువయ్యారు.

పదవులు.. బాధ్యతలు

1978లో డోన్ అసెంబ్లీ నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కేఈ కృష్ణమూర్తి తొలిసారిగా పోటీచేసి విజయం సాధించారు. 1983లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ హవాలోనూ డోన్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి రెండో పర్యాయం కూడా విజయం సాధించి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఈ తరువాత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. 1985లో డోన్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఎన్టీఆర్‌తో వచ్చిన రాజకీయ విభేదాలు కారణంగా ఆ పార్టీకి రాజీనామా చేసి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. 1989లో డోన్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్‌లో ఎక్కువ రోజులు ఉండలేక పోయారు. టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపు మేరకు 1994లో మళ్లీ టీడీపీలో చేరారు.

మిగతా 4లో...



తనయుడి కేఈ శ్యాంబాబుతో కేఈ కృష్ణమూర్తి